

మృత్యువులోనూ వీడని స్నేహం

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి
● చెన్నై సమీపంలో ఘటన ● మృతులు నెల్లూరువాసులు



దనిష్‌రెడ్డి - శ్రేయాష్ (ఫైల్ ఫొటోలు)

పెరంబూర్,నెల్లూరు (క్రైం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురువారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు సహా నలుగురు మృతిచెందారు. కిలాంబాక్కం బస్ టెర్మినల్ సమీపం ఊరపాక్కంలో గురువారం తెల్లవారుజామున విద్యార్థులు వెళుతున్న కారు హఠాత్తుగా అదుపుతప్పి కంటైనర్ లారీని ఢీకొంది.

చెన్నై శివారు ప్రాంతంలో వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరుకు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటకు చెందిన సుధాకర్‌రెడ్డి కుమారుడు ధనిష్‌రెడ్డి (21) చెన్నైలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. అలాగే న్యాయవాది గుడుగుంట వేణుగోపాల్ కుమారుడు శ్రేయాష్ (21) బుధవారం తన స్నేహితులతో కలిసి చెన్నైలో ఉంటున్న ధనిష్‌రెడ్డిని కలిశారు. అర్ధరాత్రి వారంతా కలిసి కారులో కిలాంబాక్కం బస్ టెర్మినల్ సమీపంలోని ఊరుపాక్కం వద్ద వస్తుండగా ముందు వెళుతున్న లారీ ఒక్కసారిగా ఆగడంతో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ధనిష్‌రెడ్డి, శ్రేయష్ అక్కడికక్కడే మృతి చెందగా కారులో ప్రయాణిస్తున్న మహ్మద్, ఉమ, హరిణిలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తాంబరం ట్రాఫిక్ విభాగం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

కోవై సమీపంలో...



కోవైలో బైక్‌ను ఢీకొన్న కారు

శివగంగ జిల్లా కె.నెడువయల్ ప్రాంతానికి చెందిన లోకేష్ (17) సోదరి, సోదరుడితో కలసి కోయంబత్తూర్‌లో నివసిస్తున్నాడు. గురువారం స్నేహితు డి పుట్టినరోజు వేడుకలకు వెళ్లేందుకు బైక్ ఇవ్వాలని లోకేష్ తన అన్నను అడుగగా అతను నిరాకరించాడు. దీంతో, రాత్రి అన్న నిద్రపోయిన తర్వాత లోకేష్ బైక్ తీసుకొని, తన స్నేహితుడు ప్రసన్న (15)తో కలసి బయల్దేరాడు. విలాంకుర్చి రోడ్డు సమీపంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో వెళ్తున్న బైక్‌ను ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో లోకేష్, ప్రసన్న సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. కేసు నమోదు చేసిన పోలీసుల విచారణలో... కారులో ఉన్న వ్యక్తి ఐటీ సంస్థలో పనిచేస్తున్నాడని, మద్యం సేవించి కారు నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని తెలిసింది.



స్వయం సహాయక మహిళా బృందాలతో మాట్లాడుతున్న ఉదయనిధి


● సనాతన ధర్మంపై వ్యాఖ్యల వ్యవహారం...

ఉదయనిధికి వ్యతిరేకంగా కొత్త కేసుల నమోదుపై స్టే

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి వ్యతిరేకంగా కొత్త కేసుల నమోదుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. 2023 సెప్టెంబరులో తమిళనాడు అభ్యుదయ రచయితలు, కళాకారులు చెన్నైలో నిర్వహించిన సనాతన ధర్మం నిర్మూలన మహానాడులో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులతో పోల్చుతూ వ్యాఖ్యలు చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంలో మహారాష్ట్ర, బీహార్, కర్ణాటక, జమ్ము-కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో ఉదయనిధి వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలయ్యాయి. అలాగే, పలు హిందూ సంస్థలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశాయి. ఈ కేసులన్నింటినీ ఒకటిగా మార్చి, ఆ కేసు విచారణ మద్రాసు హైకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ ఉదయనిధి తరఫున సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై గతంలో విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. ఉదయనిధి కోర్టులో హాజరు మినహాయింపు కల్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఈ పిటిషన్‌పై మళ్లీ విచారణ చేపట్టింది. ఉదయనిధికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టడానికి విధించిన తాత్కాలిక స్టే కొనసాగుతుందని ఉత్తర్వులు జారీచేసిన ధర్మాసనం.. తదుపరి విచారణ ఏప్రిల్ 28వ తేదీకి వాయిదావేసింది. అలాగే, కేసుకు సంబంధించి పిటిషనర్లు అఫిడవిట్లు దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేసిన ధర్మాసనం.. ఈ వ్యవహారంలో ఉదయనిధిపై కొత్త కేసుల నమోదుకు స్టే విధిస్తున్నట్లు ప్రకటించారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి



రూ.22.36 కోట్లతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తంజావూరు, మదురై, కాంచీపురం తదితర జిల్లాల్లో రూ. 22.36 కోట్లతో నిర్మించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను, తిరువళ్లూరు జిల్లాలో కొత్తగా నిర్మించిన డిప్యూటీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. చెన్నై సచివాలయంలో గురువారం ఉదయం రాష్ట్ర అమ్మకం పన్నులు, రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తంజావూరు జిల్లా ఒరత్తనాడు, తిరువారూరు జిల్లా తిరుత్తురైపూండి, వలంగైమాన్, మదురై జిల్లా తిరుమంగళం, కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూరు, తిరుప్పూరు జిల్లా తారాపురం, తూత్తుకుడి జిల్లా ఎట్టయపురం, సాత్తాన్‌కుళం, శ్రీవైకుంఠం, విరుదునగర్ జిల్లా రాజపాళయం, పుదుకోట జిల్లా విరాళిమలై, కరూరు జిల్లా కుళిత్తలైలో నిర్మించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎంపీ సామినాథన్, పి.మూర్తి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కుమార్ జయంత్, రిజిస్ట్రేషన్ శాఖ అధ్యక్షులు దినేష్ పొన్‌రాజ్ ఆలీవర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోలు, సబ్ కలెక్టర్లకు వాహనాలు..

సచివాలయం వద్ద రెవెన్యూ విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్‌కలెక్టర్ల కోసం రూ.4.58 కోట్లతో కొనుగోలు చేసిన 51 'బొలేరో' వాహనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. 25 జిల్లాలకు చెందిన రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు స్పెషల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్‌కలెక్టర్లకు ఈ వాహనాలను కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్ముడి, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, రెవెన్యూ నిర్వహణ విభాగం కమిషనర్ ఎం.సాయికుమార్, రెవెన్యూ విపత్తుల నిర్వహణ శాఖల అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి. అముద, రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక కార్యదర్శి కే గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు కళాకారులకు అవార్డులు...

రాష్ట్ర కళలు సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిత్రలేఖనం, శిల్ప కళల్లో అత్యంత ప్రతిభాపాటవాలను ప్రదర్శించిన 2024-25 సంవత్సరానికిగాను ఆరుగురు కళాకారులకు 'కలై సెమ్మల్' అవార్డులను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రదానం చేశారు. సాంప్రదాయిక చిత్రలేఖనం విభాగంలో ఎ.మణివేలు, శిల్ప కళలో వి.బాలచందర్, కె.కన్నియప్పన్, ఆధునిక బాణీ చిత్రలేఖన విభాగంలో కె.మురళీధరన్, ఎ.సెల్వరాజ్, శిల్పవిభాగంలో ఎన్.రాఘవన్ ఈ అవార్డులను అందుకున్నారు. ఈ అవార్డు ప్రకారం రూ. లక్ష నగదు, ప్రశంసాపత్రంతో కళాకారులను స్టాలిన్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎంపీ సామినాథన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, పర్యాటక, దేవాదాయ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే. మణివాసన్, కళలు సాంస్కృతిక శాఖ సంచాలకులు కవితా రాము తదితరులు పాల్గొన్నారు.

రహదారుల పక్కన జెండాలా?... ఏర్పాటుకు

అనుమతించబోం

● హైకోర్టు స్పష్టీకరణ



చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర రహదారులకు ఇరువైపులా జెండాలు, బ్యానర్లు, ఫ్లెక్సీ బోర్డులు కట్టేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించే ప్రసక్తే లేదని హైకోర్టు మదురై ధర్మాసనం స్పష్టం చేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీలును తోసిపుచ్చింది. మదురైకి చెందిన అమావాసై అనే సంఘసేవకుడు దాఖలు చేసిన అప్పీలు పిటిషన్‌లో మదురై విలాంగుడి ప్రాంతంలో అన్నాడీఎంకే జెండా పాతేందుకు పోలీసులు అనుమతిచ్చేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. రహదారుల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించని విధంగా ప్రైవేటు స్థలాల్లో జెండాలను పెట్టుకోవచ్చన్నారు. అంతేకాకుండా పార్టీ జెండాలు పాతే విషయమై విధి విధానాలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఆ సింగిల్ జడ్జి తీర్పుపై స్టే విధించాలని అప్పీలు పిటిషన్‌లో కోరారు. ఈ అప్పీలుపై న్యాయమూర్తులు జస్టిస్ నిషా భాను, జస్టిస్ శ్రీమతితో కూడిన ధర్మాసనం విచారణ జరిపి గురువారం తీర్పునిచ్చింది. రహదారుల్లో పార్టీల జెండాలు పాతటం, బ్యానర్లు కట్టడం వల్ల జరిగిన ప్రమాదాల్లో ప్రాణహాని సంభవించిన ఘటనలెన్నో వున్నాయని గుర్తు చేసింది. రహదారులు వాహనాలు సాఫీగా వెళ్లేందుకేనని, రహదారులకు ఇరువైపులా జెండాలు పాతటం చట్ట వ్యతిరేకమేనంటూ అప్పీలును తోసిపుచ్చింది. అంతే కాకుండా చట్ట ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో, రహదారుల సమీపంలో జెండాలు నాటేందుకు రాజకీయ పార్టీలకు అనుమతిచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని సింగిల్ జడ్జి చేసిన ప్రకటన సమంజసమేనని న్యాయమూర్తులు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు తిరుప్పూరు కుమరన్ కూడా జెండా కిందపడిపోకుండా ఆందోళన చేశారే కానీ, ఇప్పటి రాజకీయ పార్టీల్లా రహదారుల పక్కన జెండాలు నాటలేదనే విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు.

త్రిభాషా సూత్రానికి మద్దతుగా

సంతకాల సేకరణ

● తమిళిసై సౌందరరాజన్ అరెస్ట్



తమిళిసైని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనుమతి లేకుండా సంతకాల సేకరణలో పాల్గొన్న బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, పోలీసులు మధ్య వాగ్వివాదం జరిగింది. రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో త్రిభాషా విధానం అమలుపై ప్రజల మద్దతు కోరుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రారంభించిన విషయం తెలిసిందే. 'సమ కల్వి ఎంగళ్ ఉరిమై' పేరిట చేపట్టిన ఈ సంతకాల సేకరణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఈ క్రమంలో, సౌత్ చెన్నై జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో ఎంజీఆర్ నగర్ మార్కెట్ ప్రాంతంలో గురువారం ఉదయం ఆ పార్టీ సీనియర్ నేత తమిళిసై నేతృత్వంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసుల తీరును ఖండించిన తమిళిసై 'సంతకాలు సేకరించిన తర్వాతే వెళ్తామని, అంతవరకు ఇక్కడి నుంచి వెళ్లబోమంటూ' స్పష్టం చేశారు. దీంతో, ఆమెను అరెస్ట్ చేసేందుకు పోలీసులు యత్నించగా, ఆమె వాహనంలో ఎక్కేందుకు నిరాకరించారు. ఆ సమయంలో పార్టీ కార్యకర్తలు, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం మహిళా పోలీసులను రప్పించి, తమిళిసై సహా పార్టీ కార్యకర్తలను అరెస్ట్ చేసి ఓ కల్యాణ మండపానికి తీసుకెళ్లిన పోలీసులు, సాయంత్రం వారిని విడిచిపెట్టారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) : 6.25
సహర్ (శనివారం) : 4.40

పుదువై ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు

అసెంబ్లీలో సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయాలి

పుదుచ్చేరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరి బడ్జెట్ సమావేశాలు ఈ నెల 10వ తేది ప్రారంభం కానున్నాయి. ముఖ్యమంత్రి రంగస్వామి 12వ తేది బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ సమావేశాలపై ప్రధాన కార్యదర్శి శరత్‌చౌహాన్ అన్ని శాఖల అధికారులకు సర్క్యులర్ పంపారు. సంబంధిత శాఖల అధ్యక్షులు సమావేశాలకు వచ్చి పరిశీలించాలన్నారు. చర్చల సమయంలో శాఖల కార్యదర్శులు, ప్రత్యేక కార్యదర్శులు సభా ప్రాంగణంలో ఉంటూ మంత్రులకు అవసరమైన వివరాలు అందజేయాలన్నారు. సమావేశాలకు హాజరయ్యే అధికారులు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి వారికి కేటాయించిన సీట్లలో మాత్రమే కూర్చోవాలని ఆయన సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

మంత్రి సెంథిల్‌బాలాజీ అనుచరులపై

మళ్లీ ఈడీ పంజా

● ఏకకాలంలో పది చోట్ల తనిఖీలు
● ఎంపీ జగద్రక్షగన్ ఆఫీసు, టాస్మాక్‌లోనూ సోదాలు



టి.నగర్‌లోని ఎంపీ జగద్రక్షగన్ డిస్టిలరీ కార్యాలయం



కరూరులో శక్తిమెస్ యజమాని కార్తీక్ నివాసం

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అక్రమ నగదు బట్వాడా కేసు విచారణలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు మంత్రి సెంథిల్‌బాలాజీ అనుచరుల నివాసాలు, కార్యాలయాలు సహా మొత్తం 10 చోట్ల గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గతంలో సెంథిల్‌బాలాజీ రవాణా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురు నిరుద్యోగ యువకుల నుంచి లక్షలాది రూపాయల మేరకు వసూలు చేసి మోసగించారనే ఆరోపణలపై ఈడీ కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈడీ అధికారులు మరోమారు సెంథిల్‌బాలాజీ అనుచరుల నివాసాలు, కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కరూరులో ఒకే సమయంలో మూడు చోట్ల సుమారు 20 మంది ఈడీ అధికారులు సోదాలు చేశారు. కరూరు రాయనూరులో నివసిస్తున్న కొంగు మెస్ యజమాని మణి అలియాస్ సుబ్రమణి నివాసంలో, కరూరు ఆత్తూరు ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో, కోదైనగర్‌లోని బహుళంతస్థుల భవనంలో నివసిస్తున్న శక్తి మెస్ యజమాని కార్తీక్ ఫ్లాట్‌లో, పళనియప్పానగర్‌లో రెసిడెన్షియల్ భవనసముదాయంలో సెంథిల్‌బాలాజీ కుడిభుజంగా పేరు సంపాదించుకున్న ప్రజాపనుల శాఖ కాంట్రాక్టర్ ఎంసీఎస్ శంకర్ నివసిస్తున్న ఫ్లాట్‌లో 20 మందికిపైగా అధికారులు తనిఖీలు చేశారు. ఈ అధికారులు కేరళ, తెలంగాణా రాష్ట్రాల రిజిస్ట్రేషన్ నెంబర్లున్న కార్లలో పోలీసు బందోబస్తుతో ఈ దాడులు నిర్వహించారు.

నగరంలో...: స్థానిక ఆళ్వార్‌పేట ప్రాంతంలో రాష్ట్ర విద్యుత్ బోర్డు మాజీ అధికారి కాశి నివాసంలో ఈడీ అధికారులు గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విద్యుత్‌బోర్డు టెండర్లు, కాంట్రాక్టులు తదితర అంశాలలో కాశీ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఈడీ అధికారులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. ఆ విచారణ కొనసాగింపుగా ఈడీ అధికారులు మళ్ళీ సోదాలు జరిపారు.

టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో... : స్థానిక ఎగ్మోరు తాళముత్తు నటరాజన్‌మాళిగై భవనంలో ఉన్న టాస్మాక్ సంస్థ ప్రధాన కార్యాలయంలోనూ ఈడీ అధికారులు గురువారం మధ్యాహ్నం నుండి ఆకస్మిక తనిఖీలు ప్రారంభించారు. ఆ కార్యాలయం వద్ద సాయుధులైన కేంద్ర పారిశ్రామిక దళం భద్రతతో ఈ సోదాలు జరిగాయి, అదే సమయంలో టి.నగర్ తిలక్ వీధిలో ఉన్న డీఎంకే ఎంపీ జగద్రక్షగన్‌కు చెందిన డిస్టిలరీ కార్యాలయంలోనూ అధికారులు తనిఖీలు జరిపారు. థౌజెండ్ లైట్స్ ప్రాంతం గ్రీమ్స్ రోడ్డులోని ఎస్ఎన్‌జే అనే ప్రైవేటు సంస్థ కార్యాలయంలోనూ ఐదుగురు ఈడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు.

ఎస్డీపీఐ ఆఫీసులో....

స్థానిక ప్యారీస్ కార్నర్ మన్నడి ఇబ్రహీం వీధిలో ఉన్న సోషియల్ డెమోక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్డీపీఐ) ప్రధాన కార్యాలయంలో గురువారం ఉదయం ఈడీ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపారు.

సమాచార దర్శిని

మేట్టుపాళయం-ఊటీ ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం మేట్టుపాళయం-ఊటీ-మేట్టుపాళయం మధ్య ప్రత్యేక కొండ రైలు సేవలు అందిస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రత్యేక రైళ్లు ఈ నెల 28 నుంచి జూలై 6వ తేది వరకు కొనసాగనున్నాయి. ఆ ప్రకారం, ఈ నెల 28వ తేది నుంచి శుక్ర, ఆదివారాల్లో మేట్టుపాళయంలో ఉదయం 9.10 గంటలకు బయల్దేరే రైలు మధ్యాహ్నం 2.25 గంటలకు ఊటీ చేరుకుంటుంది. అలాగే, ఈ నెల 29వ తేది నుంచి శని, సోమవారాల్లో ఊటీ నుంచి ఉదయం 11.25 గంటలకు బయల్దేరే రైలు సాయంత్రం 4.20 గంటలకు మేట్టుపాళయం చేరుకుంటుంది.

9న స్వీయ రక్షణపై శిక్షణ

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బాలికలు, మహిళలకు స్వీయ రక్షణపై ఈ నెల 9వ తేది ఉచిత శిక్షణ అందించనున్నారు. మందవెల్లి రామకృష్ణ మఠం రోడ్డు సమీపంలోని ఉన్న కరాటే పాఠశాలలో ఉదయం 10 నుంచి 11.45 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. 10 నుంచి 60 ఏళ్లలోపు వారంతా పాల్గొనవచ్చు. ఆసక్తి కలిగిన వారు 9840018628 అనే నెంబరు సంప్రదించి పేరు నమోదుచేసుకోవచ్చని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు రేషన్ గ్రీవెన్స్

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)లో శనివారం రేషన్ గ్రీవెన్స్ జరుగనుంది. జీసీసీ పరిధిలోని ఆహార వస్తువుల సరఫరా, వినియోగదారుల భద్రతా శాఖకు చెందిన 19 మండల కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రీవెన్స్ జరుగనుంది. రేషన్ కార్డుల్లో చిరునామా, మొబైల్ నెంబర్లు మార్పు, పేర్లు తొలగింపు, చేర్పులు తదితరాల కోసం వినియోగదారులు వినతిపత్రాలు సమర్పించవచ్చు. అలాగే, రేషన్ దుకాణాల్లో అందిస్తున్న సరుకుల కొలత, నాణ్యత లేకుండా ఉండడం తదితరాలపై కూడా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని ఆహార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

18 నుంచి 'డ్రోన్' శిక్షణ

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ఈ నెల 18 నుంచి 20వ తేది వరకు 'డ్రోన్' శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో డ్రోన్ నిబంధనలు, డ్రోన్ టెక్నాలజీ పరిచయం, డ్రోన్ ఫొటోగ్రఫీ పద్ధతులు, ఏరియల్ ఫొటోగ్రఫీ, ఎఫ్‌పీవీ ఫొటోగ్రఫీ తదితరాలు వివరించనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు శిక్షణలో పాల్గొనవచ్చు. శిక్షణలో పాల్గొనేవారికి బస చేసేందుకు తక్కువ అద్దెతో ఏసీ వసతి గృహం కేటాయించనున్నారు. వివరాలకు www.cditn.in అనే వెబ్‌సైట్, ఈకాట్టుతాంగళ్‌లోని సంస్థ కార్యాలయాన్ని 8668108141, 8668102600, 7010143022 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

వచ్చే నెల నుంచి ఆర్థిక సర్వే

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ గణాంకాల విభాగం ఐదేళ్లకు ఒకసారి రాష్ట్రాల వారీగా ఆర్థిక సర్వే నిర్వహిస్తోంది. ఆ ప్రకారం, 8వ ఆర్థిక సర్వే ఏప్రిల్‌లో ప్రారంభమై డిసెంబరు వరకు జరుగనుంది. ఈ సర్వే నిర్వహించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం నేతృత్వంలో రాష్ట్ర స్థాయి కమిటీ నియమించింది. జిల్లా స్థాయి కమిటీలు జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో పనిచేయనున్నాయి. రాజధాని నగరం చెన్నై స్థాయిలో కార్పొరేషన్ కమిషనర్ కుమరగురుపన్ ఈ కమిటీకి నేతృత్వం వహించనున్నారు.

10 నుంచి మోస్తరు వర్షాలు

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఈ నెల 10 నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ మేరకు వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... రానున్న 48 గంటల్లో రాష్ట్రంలో ప్రధానంగా పొడి వాతావరణం ఉంటుంది. ఉదయం వేళ స్వల్పంగా మంచు కురిసే అవకాశముంది. శుక్రవారం నుంచి 9వ తేది వరకు రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 3 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశముంది. ఈ నెల 10,11 తేదీల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఒకటి, రెండు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం కొంచెం మేఘావృతంగా ఉంటూ, ఉదయం వేళల్లో మంచు కురుస్తుందని వాతావరణ కేంద్రం తెలిపింది.

'హోలి' పండుగ ప్రత్యేక రైళ్లు

పెరంబూర్,మార్చి6(ఆంధ్రజ్యోతి):'హోలి' పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ● నెం.06077 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సత్రాంగచ్చి ప్రత్యేక రైలు ఈ నెల 8,12 తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి రాత్రి 11.45 గంటలకు బయల్దేరి మూడో రోజు ఉదయం 7.15 గంటలకు సత్రాంగచ్చి చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06078 సత్రాంగచ్చి- చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 10,14 తేదీల్లో సత్రాంగచ్చి నుండి ఉదయం 9 గంటలకు బయల్దేరి మరునటిరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. ● నెం.06055 పోడనూరు-బరౌని వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 8,15 తేదీల్లో పోడనూరు నుంచి ఉదయం 11.45 గంటలకు బయల్దేరి మూడో రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06056 బరౌని-పోడనూరు వారాంతపు రైలు ఈ నెల 11,18 తేదీల్లో బరౌని నుండి రాత్రి 11.45 గంటలకు బయల్దేరి నాల్గవరోజు తెల్లవారుజామున 3.45 గంటలకు పోడనూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు జోలార్‌పేట, కాట్పాడి, పెరంబూరు, గూడు, నెల్లూరు మీదుగా వెళ్లనున్నాయి.

కేంద్ర సర్వీసులకు ఐపీఎస్ అధికారి

వాషర్‌మెన్‌పేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై ట్రాఫిక్ పోలీసు అదనపు కమిషనర్‌గా వ్యవహరిస్తున్న సుధాకర్ కేంద్ర ప్రభుత్వ సర్వీసుకు బదిలీ అయ్యారు. కేంద్ర మాదకద్రవ్యాల నిరోధక విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్‌గా సుధాకర్‌ను నియమిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు లేదా ఐదేళ్లు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు.

ఆండవన్ ఉత్తర్వుల పెట్టెలో కర్పూరం, బెత్తం

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా శివన్ మలై సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఉన్న ఆండవన్ ఉత్తర్వుల పెట్టెలో గురువారం నుంచి కర్పూరం, బెత్తం ఉంచి పూజలు చేపట్టారు. రాష్ట్రంలో ఏ ఆలయాల్లో లేని విధంగా ఈ ఆలయంలో ఉత్తర్వుల పెట్టె ఉంది. భక్తుల కలలో కనిపించే స్వామివారు సూచించిన వస్తువును ఉత్తర్వుల పెట్టెలో ఉంచి పూజిస్తారు. ఈ వస్తువుకు అనుకూలంగా దేశంలో ఏదో ఒక విధంగా ప్రభావం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఇటీవల ఓ భక్తుడి కలలో కనిపించిన స్వామి వారి ఆజ్ఞతో గత నెల 25వ తేది నుంచి ఉత్తర్వుల పెట్టెలో గడ్డిపరకలు ఉంచి పూజలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, తిరుప్పూర్ జిల్లా కాంగేయం సమీపం అరుతొళివు గంగవేల్ అనే భక్తుడి కలలో కనిపించిన స్వామివారు, ఉత్తర్వుల పెట్టెలో కర్పూరం, బెత్తం ఉంచాలని సూచించారు. గంగవేల్ ఈ విషయాన్ని ఆలయ నిర్వాహకులకు తెలుపడంతో గురువారం ఉదయం పెట్టెలోని గడ్డిపరకలు తొలగించి, కర్పూరం, బెత్తం ఉంచి పూజలు చేస్తున్నారు.



ఉత్తర్వుల పెట్టెలో ఉంచిన కర్పూరం, బెత్తం

కోవై కార్పొరేషన్‌లో రూ.578 కోట్ల పన్నుల వసూలు

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ కార్పొరేషన్‌లో రూ.577.71 కోట్లమేర పన్నులు వసూలుచేశారు. కోవై కార్పొరేషన్ పరిధిలో మొత్తం 5.87 లక్షల మంది ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం పన్నుల రూపేణా రూ.766.43 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం నిర్ణయించగా, ఇప్పటివరకు రూ.577.71 కోట్లు వసూలయ్యింది. 2023-23 ఆర్థిక సంవత్సరంలో 90.45 శాతం పన్ను వసూలు చేసి రికార్డు సృష్టించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ నెల 31వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, ఇప్పటివరకు 76.76 శాతం మాత్ర మే వసూలుకాగా, మరో 13.69 శాతం వసూలు చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు.

'ఆనంద్ వికటన్' వెబ్‌సైట్ స్తంభన తొలగించండి

కేంద్రప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు ఆదేశం

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): 'ఆనంద్ వికటన్' వెబ్‌సైట్ స్తంభన తొలగించాలని మద్రాసు హైకోర్టు కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమీపంలో ప్రధాని నరేంద్ర మోదీ సంకెళ్లతో బందీగా కూర్చొని ఉన్న కార్టూన్‌ను ఆనంద్ వికటన్ వెబ్ పత్రిక వికటన్ ప్లస్‌లో ప్రచురించారు. ఈ కార్టూన్‌పై అభ్యంతరం తెలుపుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఫిర్యాదుతో, వికటన్ వెబ్‌సైట్‌ను గత నెల 15వ తేది నుంచి స్తంభింపజేశారు. కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ చేసిన సిఫారసు కారణంగా, వికటన్ వెబ్‌సైట్ స్తంభింపజేసినట్లు వార్తలు వెలువడ్డాయి. దీనిని వ్యతిరేకిస్తూ వికటన్ యాజమాన్యం మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌ను గురువారం న్యాయమూర్తి జస్టిస్ భరత్ చక్రవర్తి విచారణ చేపట్టారు. ఇరువర్గాల వాదనల అనంతరం న్యాయమూర్తి.. వికటన్ వెబ్‌సైట్ స్తంభన తొలగించాలని కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించారు. అలాగే, వివాదాస్పదమైన కార్టూన్ బ్లాక్ చేయాలని వికటన్ సంస్థకు స్పష్టం చేశారు.

స్విమ్మింగ్ పూల్‌తో కూడిన క్రీడా మైదానం

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక షోళింగనల్లూర్ మండలంలో స్విమ్మింగ్ పూల్‌తో కూడిన క్రీడా మైదానం ఏర్పాటుకానుంది. ఈ మండల పరిధిలోని 198 వార్డు ఓఎంఆర్ కారపాక్కం గంగైఅమ్మన్ వీధిలో కార్పొరేషన్‌కు ఏడెకరాల స్థలం ఉంది. ఈ స్థలంలో స్విమ్మింగ్ పూల్‌తో కూడిన క్రీడా మైదానం ఏర్పాటుచేయాలని ఆ ప్రాంతానికి చెందిన క్రీడాకారులు కార్పొరేషన్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై స్పందించిన కార్పొరేషన్, వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్ తదితర క్రీడలు, స్విమ్మింగ్ పూల్‌తో కూడిన మైదానం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం, రూ.3 కోట్లతో అంచనాలు సిద్ధం చేశామని, మరో రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

14న టెన్త్ హాల్ టిక్కెట్లు విడుదల

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు ఈ నెల 14 మధ్యాహ్నం విడుదల చేయనున్నట్లు పరీక్ష శాఖ తెలిపింది. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 15 వరకు జరుగనున్నాయి. ఈ పరీక్షలను విద్యార్థినీ, విద్యార్థులు, ప్రైవేటు విద్యార్థులు, ఖైదీలసహా మొత్తం 9,13,036 మంది హాజరుకానున్నారు. వారిలో ప్రైవేటు అభ్యర్థుల హాల్ టిక్కెట్లు గత నెల 14వ తేది విడుదల చేశారు. ఇక, పాఠశాలల విద్యార్థుల హాల్‌టిక్కెట్లు మార్చి 14 మధ్యాహ్నం విడుదల చేయనున్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు http://www.dge.tn.gov.in/ వెబ్‌సైట్‌లో హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్ టిక్కెట్లలో విద్యార్థుల వివరాలు సక్రమంగా ఉన్నాయా అని పరిశీలించిన అనంతరం వాటిని విద్యార్థులకు అందజేయాలి. వివరాల్లో సవరణలు ఉంటే జిల్లా పరీక్ష శాఖ కార్యాలయానికి తెలియజేయాలని అధికారులు సూచించారు.

తిరువలంగాడులో గంజాయి స్వాధీనం

● ముగ్గురి అరెస్ట్

తిరుత్తణి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని తిరువలంగాడులోగంజాయి తరలిస్తున్న ముగ్గురిని తిరువళ్లూరు పోలీసులు అరెస్టుచేశారు. ఈ గంజాయినితరలించేందుకు యత్నించిన హరీష్, నితిన్, మణికండన్ సహ ఆరు కిలోల గంజాయిని జిల్లా ఎస్పీ శ్రీనివాస పెరుమాళ్ నేతృత్వంలోని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసు విచారణలో వీరు ఒరిశాలో ఆరు కిలోల గంజాయిని కొని, కారులో తీసుకొచ్చి, కళాశాల విద్యార్థులకు విక్రయించే క్రమంలో పొన్‌బాడి పోలీస్ చెక్‌పోస్ట్ వద్దపట్టుబడ్డారు. అనంతరం పోలీసులు కేసు నమోదుచేసి, కోర్టులో హాజరుపరచి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

చంద్రుడిని అధిరోహించినా కులాన్ని తీసుకెళ్తారా...?

● ప్రశ్నించిన హైకోర్టు

వాషర్‌మెన్‌పేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చంద్రుడిని అధిరోహించినా కులాన్ని తీసుకెళ్తారా అంటూ హైకోర్టు ప్రశ్నించింది. దక్షిణ భారత సెంగుంద మహాజన సంఘానికి ప్రత్యేక అధికారి నియామకంపై మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి డి.భరత్ చక్రవర్తి... కుల కేంద్రీకృత సొసైటీలను సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదు చేయవచ్చా? అని ప్రశ్నించారు. అలాగే, పాఠశాలలు, కళాశాలల పేర్లలో కులం పేర్లు తొలగిస్తారా? దీనిపై వివరణ ఇవ్వాలని గతంలో ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ పిటిషన్ మళ్లీ గురువారం విచారణకు వచ్చింది. ఆ సమయంలో న్యాయమూర్తి... న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసినా ఇంకా కులాన్ని అంటిపెట్టుకొని ఉంటున్నారని, దానికి వదిలిపెట్టలేరా? అంటూ ప్రశ్నించారు. చంద్రుడి పైకి వెళ్లినా కులాన్ని తీసుకెళ్తారా అంటూ ప్రశ్నించిన న్యాయమూర్తి... చేతి రిక్షాల రద్దు సహ పలు సంస్కరణలు అమలుచేస్తుండగా, ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే రేపటి చరిత్రలో చిరస్మరణీయమవుతుందన్నారు. కుల సంఘాల వ్యవహారంపై ప్రభుత్వ వైఖరి తెలియజేసేందుకు ఈ నెల 14వ తేది వరకు అవకాశం ఇచ్చుని, ఆలోగా ప్రభుత్వం వివరణ ఇచ్చినా, ఇవ్వకున్నా ఈ కేసులో తీర్పు వెలువరిస్తామని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

మూడు మార్గాల్లో 160 కి.మీ వేగంతో రైళ్లు

● నిర్మాణ పనులు ప్రారంభం

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణ రైల్వే పరిధిలోని చెన్నై-గూడూరు, అరక్కోణం-జోలార్‌పేట, సేలం-కోయంబత్తూర్ తదితర మార్గాల్లో గంటకు 160 కి.మీ వేగంతో రైళ్లు నడిపేలా పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని ప్రధాన మార్గాల్లో రైళ్ల వేగం పెంచేందుకు దక్షిణ రైల్వే చర్యలు చేపట్టింది. రైలు మార్గాలు, సిగ్నలింగ్ వ్యవస్థ అభివృద్ధి, బ్రిడ్జి నిర్మాణం, వేగ పరిమితి తొలగింపు సహా పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు పూర్తయిన మార్గాల్లో రైళ్ల వేగం పెంచి నడిపేందుకు అనుమతిస్తారు. ఆ ప్రకారం, దక్షిణ రైల్వే పరిధిలోని చెన్నై-గూడూరు, చెన్నై-అరక్కోణం-జోలార్‌పేట తదితర మార్గాల్లో ప్రస్తుతం 130 కి.మీ వేగంతో రైళ్లు నడుపుతున్నారు. అలాగే, పలు మార్గాల్లో కూడా రైళ్ల వేగం క్రమక్రమంగా పెంచుతున్నారు. ప్రస్తుతం చెన్నై సెంట్రల్-బెంగళూరు-మైసూరు, సెంట్రల్-కోవై, చెన్నై ఎగ్మూర్-తిరునల్వేలి సహా పలు మార్గాల్లో వందే భారత్ రైళ్లు నడుపుతున్నారు. ఈ రైళ్లు అత్యధికంగా 180 కి.మీ వేగంతో వెళ్లే సామర్థ్యం కలిగి ఉండగా, ప్రస్తుతం 110 నుంచి 130 కి.మీ వేగంతో మాత్రమే నడుపుతున్నారు. అలాగే, ఈ మార్గాల్లో వెళ్లే ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లు 120 కి.మీ వేగంతో నడుస్తున్నాయి. ప్రస్తుతం వందే భారత్ సహా అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేగం పెంచాలని నిర్ణయించారు. ఈ విషయమై దక్షిణ రైల్వే అధికారులు మాట్లాడుతూ... రైల్వే నిబంధనల ప్రకారం, గ్రూప్-ఏ మార్గాల్లో రైళ్లు అధికంగా 160 కి.మీ వేగంతో వెళ్లేందుకు అనుమతులున్నాయన్నారు. అందువల్ల దక్షిణ రైల్వే పరిధిలోని చెన్నై-గూడూరు,అరక్కోణం-జోలార్‌పేట,సేలం-కోవై మార్గాల్లో గంటలకు 160 కి.మీ వేగంతో రైళ్లు నడిపేలా నిర్మాణాత్మక పనులు చేపట్టామన్నారు. అధికంగా ఉన్న వంపులు గుర్తించి తొలగించడం, పాత ఫ్లై ఓవర్ల తొలగింపు, కొత్త వంతెన నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే, సిగ్నలింగ్ వ్యవస్థ అభివృద్ధి, విద్యుత్ పంపిణీ సామర్థ్యాలు మెరుగుపరిచే చర్యలు ప్రారంభించామన్నారు. ఈ పనులు పూర్తయ్యేందుకు మూడు సంవత్సరాలు పడుతుందని అధికారులు తెలిపారు.

బడ్జెట్ సమావేశాల్లోగా చర్చలు ముగించాలి

● రవాణా కార్మిక సంఘాల డిమాండ్



ర్యాలీలో రవాణా కార్మిక సంఘాల నేతలు

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ కార్మికుల డిమాండ్లను రాబోయే బడ్జెట్ సమావేశాల్లోగా చర్చించి ముగించాలని సచివాలయం వైపు ర్యాలీ కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రవాణా శాఖలో ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసాన్ని బడ్జెట్‌లో కేటాయించాలి, పదవీవిరమణ పొందిన కార్మికులకు పింఛన్ ప్రయోజనాలు అందించాలి సహా పలు డిమాండ్ల సాధనకు సీఐటీయూ, ఏఐటీయూసీ, డీటీఎస్ఎఫ్, మాజీ కార్మికుల సంఘాల ఆధ్వర్యంలో పల్లవన్ రోడ్డు నుంచి సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించాయి. బడిఘాట్ మునీశ్వర ఆలయం నుంచి ఈ ర్యాలీని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సౌందర్‌రాజన్ ప్రారంభించారు. ర్యాలీలో కార్మిక సంఘాల నేతలు కె.అర్మగనయినార్, శశికుమార్, వి.దయానందం, కనకరాజ్, నందాసింగ్, మురుగరాజ్, తిరుమలస్వామి, రాజాజీ సహా పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. ఈ ర్యాలీని పల్లవన్ హౌస్ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసుల చొరవతో కార్మిక సంఘాల ప్రతినిధులు సచివాలయంలో రవాణా శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు సౌందర్‌రాజన్ మాట్లాడుతూ. ప్రజలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతోనే శాంతియుతంగా ఆందోళన చేపట్టామని, ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఎంజీఆర్ మండ్రం నేతకు చెంపదెబ్బ

● విరుదునగర్‌సభలో రాజేంద్రబాలాజీ ఆగ్రహం



చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ దేశబంధు మైదానంలో బుధవారం రాత్రి జరిగిన మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతి సభలో అన్నాడీఎంకే నేత మాజీ మంత్రి కేటీ రాజేంద్రబాలాజీ ఎంజీఆర్ మండ్రం నేత చెంపచెళ్లుమనిపించారు. ఈ సభ ప్రారంభంలో విరుదునగర్ జక్కాదేవి నగర్‌కు చెందిన అన్నాడీఎంకే ఈస్ట్ యూనియన్ ఎంజీఆర్ మండ్రం డిప్యూటీ కార్యదర్శి నందకుమార్ వేదికపైనున్న రాజేంద్ర బాలాజీకి, మరో ప్రముఖుడికి, చివరగా మాజీ మంత్రి మాఫాయ్ పాండ్యరాజన్‌కు శాలువాలతో సత్కరించారు. వెంటనే రాజేంద్రబాలాజీ నందకుమార్‌ను తనదగ్గకు పిలిచి చెంపమీద కొట్టారు. అంతటితో విడిచిపెట్టకుండా ఏంటి సభలో రాజకీయ చిచ్చు పెడుతున్నావా అంటూ కసరుకున్నారు. విరుదునగర్ పార్టీ వ్యవహారాల్లో మాజీ మంత్రి మాఫాయ్ పాండ్యరాజన్ అధికంగా జోక్యం చేసుకుంటున్నారనే పార్టీలోని ప్రత్యర్థి వర్గం ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఎంజీఆర్ మండ్రం నేత నందకుమార్ ఆయనకు అధిక ప్రాధాన్యతనిచ్చి సత్కరించడం వల్లే ఈ సంఘటన చోటుచేసుకుందని పార్టీ స్థానిక శాఖ నాయకులు గుసగుసలాడుకున్నారు.

పల్లిపట్టులో ఘనంగా స్టాలిన్ జన్మదిన వేడుకలు



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీనేతలు

తిరుత్తణి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పల్లిపట్టులో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పల్లిపట్టు సౌత్ యూనియన్ కార్యదర్శి జి.రవీంద్ర ఆధ్వర్యంలో కుక్కళూరు పంచాయితీలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి, అనంతరం డీఎంకే పార్టీ ప్రముఖులతో కలిసి పేదలకు సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపి గవాస్కర్, రవిభాస్కర్, సుత్తి మూర్తికుమార్, అంబేడ్కర్ విద్యాసాగర్, అక్కడి స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

హైడ్రోకార్బన్ బయోగ్యాస్ పథకం మాకొద్దు

● ఎండీఎంకే ఎంపీ వైగో

ప్యారీస్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సముద్రగర్భంలో హైడ్రోకార్బన్ గ్యాస్ వెలికితీసే పథకాన్ని అమలుచేయొద్దని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి, ఎంపీ వైగో కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన గురువారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల మధ్య సముద్రగర్భంలో హైడ్రోకార్బన్ బయోగ్యాస్ వ్యాపించివున్నట్లు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ పరిశోధనలో గుర్తించిందని వైగో తెలిపారు. రామనాథపురం నుండి కన్నియాకుమారి వరకు సముద్రంలో విస్తరించిన హైడ్రోకార్బన్ బయోగ్యాస్‌ను బయటకు తీసేందుకు కేంద్రం టెండర్లు కోరిందని, జాలర్ల సంక్షేమార్థం ఈ పథకాన్ని వాపసు తీసుకోవల్సిందిగా వైగో కేంద్రప్రభుత్వాన్ని కోరారు.

కామరాజ్ మార్కెట్ పేరు మార్చొద్దు

కాంగ్రెస్ నేత తిరగరాజన్ అభ్యర్థన ● కమిషనర్‌కు వినతిపత్రం



వినతిపత్రాన్ని అందిస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుత్తణి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి మునిసిపాలిటీలోని కామరాజ్ కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో 3కోట్లతో కొత్త భవనాన్ని నిర్మించాలని డీఎంకే ప్రభుత్వం గత నెలలో నిర్ణయించింది. ఈ భవనానికి, ఈ మార్కెట్‌కు కలైంజర్ సెంటెనరీ డైరీ వెజిటేబుల్ మార్కెట్‌గా పేరు మార్చాలని తిరుత్తణి కౌన్సిల్ ఒక తీర్మానాన్ని చేసింది. ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని కోరుతూ, తిరుత్తణి కాంగ్రెస్ నేత తిరగరాజన్ నేతృత్వంలో మాజీప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ నేపథ్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో తిరగరాజన్ మాట్లాడుతూ, కూరగాయల మార్కెట్ పేరును మార్చకూడదని, మాజీముఖ్యమంత్రి కరుణానిధి పేరు పెట్టకూడదని, పాత పేరైన కామరాజ్ పేరునే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం 50మంది కాంగ్రెస్ సభ్యులతో మునిసిపాలిటీ కమిషనర్ బాల సుబ్రమణ్యంకు వినతిపత్రాన్ని అందజేశారు.

ట్రాఫిక్ పోలీసులకు 'ఏసీ' హెల్మెట్లు



పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎండ వేడిని తట్టుకునేలా ట్రాఫిక్ పోలీసులకు 'ఏసీ' హెల్మెట్లు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి రెండో వారం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. కానీ, ఎండలు మండుతున్నా ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో పోలీసులు విధుల్లో ఉండాల్సిందే. ఎండల నుంచి వాహనచోదకులు ఉపశమనం కలిగించేలా ప్రధాన నగరాల్లోని సిగ్నల్స్ వద్ద పందిళ్లు ఏర్పాటుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, చెన్నైను విభజించి కొత్తగా రూపొందిన ఆవడి పోలీసు కమిషనర్ కార్యాలయ పరిధిలోని ట్రాఫిక్ పోలీసులకు కమిషనర్ శంకర్ ఏసీ హెల్మెట్లు అందజేశారు. సహజ ఫైబర్‌తో రూపొందించారు. బ్యాటరీ ద్వారా ఏసీ యంత్రం పనిచేసి ట్రాఫిక్ పోలీసులకు ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తుందని అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో గత ఏడాది తగ్గిన నేరాలు

● డీజీపీ శంకర్ జివాల్



ప్యారీస్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఏడాది నేరాలు చాలావరకు తగ్గాయని డీజీపీ శంకర్ జివాల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో 2024వ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగావున్న పోలీస్‌స్టేషన్లలో నమోదైన క్రైమ్ కేసులను పరిశీలించి వాటిపై తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర పోలీస్ శాఖ చేపట్టిన చర్యలతో ఆస్తులకు సంబంధించినవి, హత్యలు, హత్యాప్రయత్నాలు, దోపిడీ తదితర నేరాలు తగ్గినట్లు తెలిపారు. ప్రధానంగా రౌడీయిజాన్ని పూర్తిగా అదుపుచేశామని, మాజీ రౌడీలకు సంబంధించిన కేసులు పరిశీలించి ముందు జాగ్రత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ వ్యవహరిస్తున్న తీరు తృప్తికరంగా వుందని డీజీపీ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న విద్యార్థి సహా ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో గంజాయి తరలిస్తున్న విద్యార్థి సహా ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి వస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కొందరు గంజాయి తరలిస్తున్నారని వాషర్‌మెన్‌పేట పోలీసులకు సమాచారం అందింది. దీంతో, బుధవారం తిరువొత్తియూర్ రైల్వేస్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అక్కడ అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారి బ్యాగుల్లో 2 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో, తిరువొత్తియూర్ కార్గిల్ నగర్‌కు చెందిన జీవ (22) అని, మీంజూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నట్లు, మరో వ్యక్తి తమిళ్‌సెల్వన్ (22)గా గుర్తించారు. పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకొస్తున్న వారు నగరంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలడంతో, వారి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

● ముగ్గురి అరెస్టు

ప్యారీస్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్‌హిల్స్ సమీపం పాడియనల్లూరులో లారీలో అక్రమంగా తరలించిన 37టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పౌరసరఫరాల శాఖ అధికారులు ముగ్గురిని బంధించారు. పాడియనల్లూరు ప్రాంతంలోవున్న పలు ప్రైవేటు గోదాముల నుండి చట్టవిరుద్ధంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ ఆర్థిక విభాగం ఛీఫ్ డైరెక్టర్ సీమా అగర్వాల్‌కు సమాచారం అందింది. ఆమె ఆదేశాల మేరకు మారువేషాల్లో గురువారం ఉదయం అక్కడికి చేరకున్న అధికారులు ఓ గోదాము సమీపంలో నిలిపి ఉన్న లారీలో లోడ్‌చేసిన 37టన్నుల రేషన్ బియ్యాన్ని, లారీ సహా రెండు లోడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సతీషకుమార్ సహా ముగ్గురిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

జైలులో చిలుకను పెంచుతున్న ఖైదీ

● స్వాధీనం చేసుకునేందుకు వెళ్ళిన వార్డెన్‌పై దాడి

ప్యారీస్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సేలం సెంట్రల్ జైల్లో ఓ ఖైదీ పెంచుకున్న చిలుకను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించిన వార్డెన్‌పై జరిగిన దాడికి సంబంధించి అస్తంపట్టి పోలీసులు కేసు నమోదు చేశారు. సేలం సెంట్రల్ జైలో తిరునల్వేలి జిల్లా సుత్తమల్లి గ్రామానికి చెందిన శివలబెరియన్ (37) అనే యావజ్జీవ ఖైదీ ఉన్నాడు. అతను ఓ చిలుకను పెంచుతున్నట్లు జైలు సూపరెండెంట్ వినోద్‌కుమార్‌కు తెలిసింది. ఆయన ఆదేశాల మేరకు బుధవారం జైలర్ రాజేంద్రన్, వార్డెన్ మాయవన్ వెళ్లి చిలుకను అప్పగించాలని శివలబెరియన్‌ను కోరారు. దీంతో ఆ ఖైదీ కోపంతో వారిపై దాడికి పాల్పడంతో తీవ్రంగా గాయపడిన వార్డెన్ మాయవన్ స్పృహ కోల్పోయారు. వెంటనే జైలులోవున్న వైద్యసిబ్బంది ఆయనకు ప్రథమ చికిత్సచేసి, సేలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం చిలుకను స్వాధీనం చేసుకున్న జైలు అధికారులు వార్డెన్‌పై జరిగిన దాడిపై అస్తంపట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా వుండగా జైలు ప్రాంగణంలో ఓ ఖైదీ చిలుకను పెంచుతున్నా పట్టించుకోని జైలర్ రాజేంద్రన్, సబ్ జైలర్ శివ, వార్డెన్లు రాజశేఖర్, ముత్తుకుమార్, తిరునావుక్కరసు, మహేంద్రన్లకు జైలు ఎస్పీ వినోద్‌కుమార్ మెమో జారీచేశారు.

పెన్నై రిజర్వ్ ఫారెస్ట్‌లో మగ పులి మృతి



పులి కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వేళచ్చేరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పెన్నై రిజర్వ్ ఫారెస్ట్‌లో మగపులి మృతి చెంది ఉండడాన్ని అధికారులు గుర్తించారు. నేలకోట అటవీ రేంజ్ పరిధిలో వరుసగా రెండు పులలు మృతిచెందడంపై దిగ్భ్రాంతి కలిగిస్తోంది. నీలగిరి జిల్లా కూడలూరు అటవీ డివిజన్ పరిధిలోని నేలకోట ప్రాంతంలో మూడు రోజు కిత్రం ఓ పులి మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. పులి మృతికి గల కారణాలు అన్వేషిస్తున్న సమయంలో, గురువారం ఉదయం అదే ప్రాంతంలో మరో మగ పులి కళేబరం కనిపించింది. ముదుమలై టైగర్ రిజర్వ్ డిప్యూటీ డైరెక్టర్ నేతృత్వంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజా ప్రతినిధులు ఆ ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మాయర్ అసిస్టెంట్ పశు వైద్యాధికారి ఇందుజ పులి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతిచెందిన పులికి పదేళ్ల వయసు ఉంటుందని, మరో పులి దాడితో శరీరంపై గాయాలుండడతో పాటు తలపై బలమైన గాయం ఉంది. మరో పులితో పోరాడే సమయంలో మృతి చెంది ఉంటుందని భావించిన అధికారులు, ఫోరెన్సిక్ పరీక్షల కోసం శాంపిల్స్ సేకరించారు. అనంతరం పులి కళేబరాన్ని తగులబెట్టారు.

అగర్వాల్ ఆస్పత్రిలో గ్లకోమా రోగులకు ఉచిత వైద్యపరీక్షలు

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ గ్లకోమా వారోత్సవం సందర్భంగా నగరంలో డాక్టర్ అగర్వాల్ నేత్రవైద్యశాలలో ఈ నెలాఖరు వరకు గ్లకోమా రోగులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి చీఫ్ క్లినికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్విన్ అగర్వాల్ తెలిపారు. ప్రతియేటా మార్చి 9 నుంచి 15 వరకూ గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తుంటామని, ప్రస్తుత యేడాది 'భవిష్యత్తులో స్పష్టమైన దృష్టి' అనే నినాదంతో ఈ వారోత్సవం జరుపుకోనున్నామని తెలిపారు. ఆ సందర్భంగా ఈ నెల 31 వరకు గ్లకోమా రోగులకు ఉచిత స్క్రీనింగ్ టెస్టులు జరుపుతామని, 9594903774 అనే నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకుని ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



రజనీకాంత్‌తో 'డ్రాగన్' చిత్ర బృందం

ఆ కల నెరవేరిన రోజు

● అశ్వత్ మారిముత్తు

'డ్రాగన్' చిత్ర బృందాన్ని సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రదీప్ రంగనాథన్ హీరోగా, అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మితమై గత నెలలో విడుదలైన 'డ్రాగన్' మూవీ ఘన విజయం సాధించింది. విడుదలైన పది రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ నేపథ్యంలో చిత్ర హీరో ప్రదీప్ రంగనాథన్, దర్శకుడు అశ్వత్, నిర్మాత అర్చనలను రజనీకాంత్ పోయెస్ గార్డెన్‌లోని తన నివాసానికి ఆహ్వానించి వారిని అభినందించారు. దీనిపై అశ్వత్ మారిముత్తు ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేస్తూ, 'ఆ కల నెరవేరిన రోజు' అని పేర్కొన్నారు. 'అద్భుతమైన కథా రచన, సూపర్.. సూపర్' అంటూ రజనీ సార్ ప్రశంస. సినిమా చూసిన తర్వాత ఆయన ఇంటికి ఆహ్వానించి అభినందించారు. కష్టపడి పైకి రావాలనే ప్రతి అసిస్టెంట్ డైరెక్టర్ కల ఇది. ఆ కల నెరవేరిన రోజు ఈ రోజు' అంటూ ట్వీట్‌లో పేర్కొన్నారు.

మరో దర్శకుడిని హీరో చేస్తున్న ఏజీఎస్

కోలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థ ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ పలువురు ప్రతిభావంతులైన యువ దర్శకులను హీరోలను చేస్తోంది. ఆ కోవలో ఇపుడు మరో యువ దర్శకుడు ఇలన్‌ను హీరో చేయనుంది. గతంలో దర్శకుడు ప్రదీప్ రంగనాథన్‌ను 'లవ్‌టుడే' సినిమాతో హీరోగా మార్చింది. ఇపుడు 'డ్రాగన్' అనే మూవీ నిర్మించి మరో బ్లాక్‌బస్టర్ హిట్ తమ ఖాతాలో వేసుకుంది. ఈ నేపథ్యంలో 'ప్యార్ ప్రేమ కాదల్' అనే చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమైన ఇలన్‌ను ఇపుడు హీరోగా పరిచయం చేయనుంది. ఏజీఎస్ నిర్మాతలకు ఇలన్ చెప్పిన కథ బాగా నచ్చడంతో హీరోగా నటిస్తూనే దర్శకత్వ బాధ్యతలను కూడా చేపట్టాలని సూచించారు. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెల్లడి కానుంది. కాగా, గతంలో దర్శకులుగా సక్సెస్ సాధించిన పలువురు మంచి నటులుగా గుర్తింపుపొందారు. ఇలాంటి వారిలో దివంగత విసు, భారతీరాజా, వాసు, కేఎస్ రవికుమార్, భాగ్యరాజ్, సుందర్, చేరన్, ఎస్‌జే సూర్య, సెల్వరాఘవన్, శశికుమార్, సముద్రఖని ఇలా అనేక మంది జాబితాలో ఉన్న విషయం తెల్సిందే.



దర్శకుడు ఇలన్

20 రోజుల పాటు శవంగా నటించిన హీరోయిన్

సాధారణంగా సినిమాలో ఒక సన్నివేశంలో శవంగా నటించేందుకు నటీనటులు వెనుకంజ వేస్తుంటారు. అలాంటిది ఈ యువ హీరోయిన్ మాత్రం 40 రోజుల పాటు సినిమా షూటింగ్ జరిగితే అందులో 20 రోజుల పాటు శవంగానే నటించారు. ఆమె పేరు రూప కొడువాయూర్. తెలుగు చిత్రం 'ఉమా మహేశ్వరాయ ఉగ్రరూపశ్య' ద్వారా వెండితెరకు పరిచయమయ్యారు. ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కిన తమిళ చిత్రం 'యమఘాతకి' నేడు విడుదలకానుంది. ఈ సినిమాలో శవంగా నటించడంపై రూప స్పందిస్తూ, 'చిత్రం షూటింగ్ 40 రోజుల పాటు జరిగింది. ఇందులో 20 రోజుల పాటు శవంగానే నటించాను. దర్శకుడు కథ వివరించే సమయంలోనే సినిమాలో నటించేందుకు అంగీకరించాను. కారణం శవంగా నటించడం కాదు.. దాని వెనుక పెద్ద పోరాటం ఉంది. ఈ మూవీలో కేవలం శవంగానే నటించలేదు. నా క్యారెక్టర్‌లో ప్రేమ ఉంది. దానికి సంబంధించి ఘర్షణలున్నాయి. జీవితంలో కొన్ని లక్ష్యాలున్నాయి. దురాగతాలకు వ్యతిరేకిస్తూ ధైర్యంగా అడ్డునిలబడే శక్తి ఉంది. ఈ మూవీతో నాకు తమిళంలో మంచి పేరు వస్తుందని గట్టిగా నమ్ముతున్నాను' అని వివరించారు.



రూప కొడువాయూర్



'అస్తిరం'లో శ్యామ్

థియేటర్ల కొరత... వాయిదాపడిన 'అస్తిరం'

శ్యామ్ హీరోగా నటించిన చిత్రం 'అస్తిరం' ఈ నెల 7వ తేదీ శుక్రవారం విడుదలకావాల్సి ఉంది. అయితే, థియేటర్ల కొరత కారణంగా విడుదలకు వెనక్కితగ్గింది. అదే రోజున 'కింగ్‌స్టన్', 'జెంటిల్ ఉమెన్', 'మర్మర్', 'నిరమ్ మారుమ్ ఉలగిల్', 'యమఘాతకి', 'అంబి', 'లెగ్‌పీస్'తో సహా మొత్తం ఏడు చిత్రాలు విడుదలవుతున్నాయి. దీంతో 'అస్తిరం' మూవీకి తగినన్ని థియేటర్లు లభించలేదు. ఈ కారణంగా సినిమా విడుదల వాయిదా వేస్తున్నట్టు మేకర్స్ ప్రకటించారు. బెస్ట్ మూవీస్ పతాకంపై ధన షణ్ముగమణి నిర్మాణంలో రూపొందిన ఈ మూవీలో శ్యామ్ హీరోగా నటించగా, డెబ్యూ డైరెక్టర్ అరవింద్ రాజగోపాల్ దర్శకుడు. హీరోయిన్‌గా మోడలింగ్ రంగానికి చెందిన నిరా, ఇతర పాత్రల్లో నిళల్‌గల్ రవి, జీవా రవి, అరుణ్ డి శంకర్, కొత్త ముఖం రంజిత్ నటించారు.



శబరిమల ఆలయానికి పురుషులు ఏ సమయంలోనైనా వెళ్ళి దర్శించి రావచ్చు. 10యేళ్లలోపు బాలికలు, 50 యేళ్లు దాటిన మహిళలు మాత్రమే శబరిమలై మణికంఠుని దర్శనానికి అనుమతిస్తారు. శబరిమలై అయ్యప్ప మాల ధరించి, తలపై ఇరుముడి కట్టుకుని భక్తులు కొండెక్కి స్వామి వారిని దర్శించుకుంటారు. ఆ పద్ధతిలోనే వయసుతో నిమిత్తం లేకుండా మగువలు మాత్రమే ఇరుముడి కట్టుకుని వ్రతమాచరించి వెళ్లే ఓ దివ్యక్షేత్రం కన్నియాకుమారిలో ఉంది. అదే మండైక్కాడు భగవతి అమ్మన్ ఆలయం. ప్రతియేటా మాసి నెల ఉత్సవాల సందర్భంగా దేశం నలమూలల నుంచి మగువలు విచ్చేయడం విశేషం.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి





మాసి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు

మగువలకు ప్రత్యేకం మండైక్కాడు ఆలయం

● మహిళల శబరిమలగా పిలవబడే భగవతి అమ్మన్ దేవాలయం



సంతానభాగ్యం కోసం స్థలవృక్షానికి ఊయల కడుతున్న దృశ్యం

ఆలయ విశేషాలు...

ఈ ఆలయంలో మండైక్కాడు భగవతి అమ్మవారు వల్మీకం (పుట్ట) రూపంలో భక్తులను అనుగ్రహిస్తున్నారు. ప్రతియేటా పెరుగుతున్న పుట్టలోనే అమ్మవారు ఆవిర్భవించారు. ప్రతిరోజూ ఈ వల్మీకం పైభాగంలో చందనంతో అమ్మవారి రూపాన్ని అర్చకులు తీర్చిదిద్దుతారు. ఆ ముఖారవిందానికి దిగువ భాగాన్ని ఎరుపు రంగు పట్టు వస్త్రం కడతారు. అంతకంటే ముందు రాణి సేతులక్ష్మీబాయ్ కానుకగా సమర్పించిన వెండి అంగీని ధరింపజేస్తారు. ఈ అలంకరణలతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ అమ్మవారికి దిగువన ఉత్సవమూర్తిగా అమ్మవారి విగ్రహం ఉంది.

దేశ విదేశాల నుంచి భక్తుల రాక....

సుప్రసిద్ధ మండైక్కాడు భగవతి అమ్మవారి ఆలయంలో తమిళమాసమైన మాసి నెలలో నిర్వహించే ఉత్సవాలకు దేశవిదేశాల నుండి మహిళలు ప్రత్యేకించి కేరళ రాష్ట్రానికి చెందిన లక్షలాదిమంది మహిళలు ఇరుముడి కట్టుకుని, 'అమ్మే శరణం... దేవీ శరణం' అంటూ నినాదాలు చేస్తూ వచ్చి సామూహికంగా పొంగళ్లుపెట్టి అమ్మవారిని దర్శించుకుంటారు.

స్థలపురాణం...

పూర్వం ఈ ఆలయ ప్రాంతం దట్టమైన అడవిలా ఉండేది. సమీప ప్రాంతాలకు చెందిన ప్రజలు పశువులను మేతకు తోలుకెళ్లేవారు. ఇలా పశువుల మందలు వెళ్ళి వచ్చే అడవి కనుక ఆ ప్రాంతాన్ని 'మండైక్కాడు' పిలిచేవారు. కాలగమనంలో ఆ పేరు కాస్తా 'మండైక్కాడు'గా మారింది. ఇక ఈ ప్రాంతానికి చేరువగా ఉన్న శేరమంగళంలో ఆదిశంకరుల శిష్యుడొకరు నివసించేవారు. ఆయన చేతిలో రాజరాజేశ్వరి వాసం చేసే శ్రీచక్రం ఉండేది. రోజూ ఆయన ఈ ప్రాంతానికి వచ్చి శ్రీచక్రాన్ని నేలపై ఉంచి ధ్యానం చేసేవారు. ఉదయం ధ్యానాన్ని ప్రారంభించి సాయంత్రం ధ్యానాన్ని ముగించేసరికి ఆయన చుట్టూ పుట్టపెరిగిపోతుండేది. ఆ ప్రాంతంలో మేకలు మేపేవారు ఆ పుట్టను తొలగించి ఆయనను పైకి లేపేవారు. ఆ తర్వాత ఆయన తన శ్రీచక్రం తీసుకుని తన నివాసానికి తిరిగి వెళ్లేవారు. ఇలా ఎన్నో మాసాలు గడిచాయి. ఓ రోజు సాయంత్రం ధ్యానం ముగించుకుని నేలపై ఉంచిన శ్రీచక్రాన్ని కదిలిస్తే అది కదలలేదు. ఆ సమయంలో 'శ్రీచక్రంలో తాను స్థిరనివాసమేర్పరచుకున్నానని భగవతి అమ్మగా పూజలందుకుంటాన'ని అశరీరవాణి వినిపించింది. దీంతో ఆయన రోజూ పుట్టను తొలగించి తనను ధ్యానం నుండి లేపే పశువుల కాపర్లను పిలిచి ఇక తనను లేపొద్దని వారిని ఆదేశించారు. ఆ తర్వాత ఆ యువకులు ఆయన చుట్టూ పుట్టపెరుగుతున్నా పట్టించుకోలేదు. చివరకు ఆయన ఆ ప్రాంతంలోనే జీవ సమాధినొందారు. ఓ రోజు ఆ యువకులు ఆవుల మందను ఇళ్ళకు తోలుకెళుతుండగా ఓ ఆవు పుట్టను కాలితో తొక్కటంతో రక్తం ధారగా స్రవించసాగింది. దీంతో భయపడిన పశువుల కాపర్లు ఊరిలోని పెద్దవారికి విషయం చెప్పి అక్కడికి తీసుకొచ్చారు. ఆ సమయంలో ఊరి పెద్దకు పూనకం వచ్చి ఏపుగా పెరిగిన వల్మీకమే (పుట్టే) భగవతి అమ్మవారని, రక్తం స్రవించడం ఆగాలంటే చందన తాపడం చేస్తే చాలని తెలిపారు. ఆ మాట ప్రకారమే ప్రజలు చందనం తీసుకొచ్చి రక్తం కారుతున్న చోట పెట్టగా రక్తం ఆగిపోయింది. ఇలా ఆదిశంకరుల శిష్యుడు ప్రతిష్ఠించిన శ్రీచక్రమే మగువల కోరికను తీర్చే భగవతి అమ్మవారు అనుగ్రహిస్తున్నారు. ఈ అమ్మవారు పార్వతీదేవీ అంశమని కూడా భక్తులు చెబుతుంటారు. మొదట ఈ వల్మీక ప్రాంతంలో తాటాకులతో పర్ణశాల ఏర్పాటు చేశారు. అయితే రోజురోజుకూ ఆ వల్మీకం పెరుగుతుండటంతో స్థానికులంతా కలిసి ఆలయాన్ని నిర్మించారు. ఆ వల్మీకం నేడు 15 అడుగుల వరకూ పెరిగింది. ప్రస్తుతం కేరళ భక్తులందరికీ ఈ భగవతి అమ్మవారే ఆరాధ్యదేవతగా మారారు.



పొంగళ్లు పెడుతున్న మహిళలు



మాసి ఉత్సవాలను పురస్కరించుకుని విద్యుద్దీపాలంకరణ

కూలీల ఆకలి తీర్చిన అమ్మవారు...

పూర్వం తిరువిదాంకూర్ మహారాజుకు కప్పంగా చెల్లించేందుకు వడ్ల బస్తాలతో ఇద్దరు కూలీలు ఎద్దులబండిలో బయలుదేరారు. మార్గమధ్యంలో మండైక్కాడు చేరుకునేసరికే విపరీతమైన ఆకలి వేసింది. ఆ ప్రాంతంలోని ఓ ఇంటి యజమాని వద్దకు వెళ్ళి ఆకలిగా ఉందని కాస్త భోజనం పెట్టమని అడిగారు. ఆ ఇంటి యజమాని ఎంగిలిచేత్తో కాకిని కూడా తరుమని పిసినారి. ఈ కూలీలను ఆటపట్టించేందుకు దీపాలు వెలుగుతున్న భగవతి అమ్మవారి ఆలయాన్ని (అప్పట్లో తాటి ఆకుల పర్ణశాల) చూపి అక్కడో పూటకూళ్ల అమ్మ ఉంది. అక్కడికి వెళితే మీకు కడుపారా భోజనం దొరుకుతుందని పంపి ఆ ఇంటి యజమాని లోలోపల నవ్వుకున్నాడు. ఆ కూలీలు ఇద్దరూ ఆలయంలోకి ప్రవేశించగానే అక్కడ భోజనశాల కనిపించింది. ఓ ముత్తయిదువ గరిట పట్టుకుని వారిని సముద్రతీరానికి వెళ్ళి కాళ్లు కడుక్కుని రమ్మంటూ పురమాయించింది. కూలీలిరువురూ సముద్రతీరానికి వెళ్ళి కాళ్లు కడుక్కుని తిరిగి రాగానే ఆమె చక్కటి భోజనాన్ని వడ్డించింది. ఆ తర్వాత భుక్తాయాసంతో ఇరువురూ రాత్రి అక్కడే నిద్రపోయారు. ఉదయం లేచి చూడగా వారిద్దరూ దిగ్భ్రాంతికి గురయ్యారు. తాామున్నదని భగవతి అమ్మవారి ఆలయమని తెలుసుకుని ఆశ్చర్యపోయారు. రాత్రి పూటకూళ్ల భోజన శాలగా కనిపించిన చోట ఎత్తయిన పుట్ట ఆ పుట్టపై అమ్మవారి ఆకారం ఉండటం చూసి తమ ఆకలిని తీర్చింది సాక్షాత్తూ అమ్మవారేనని తెలుసుకుని పరవశించిపోయారు. ఈ విషయం స్థానిక భక్తుల ద్వారా తెలుసుకున్న తిరువిదాంకూర్ మహారాజుకు అక్కడ పర్ణశాల తొలగించి అందమైన ఆలయాన్ని నిర్మించారు. అరేబియా సముద్రానికి అర ఫర్లాంగు దూరంలో ఈ ఆలయం ఉంది. ఉత్సవాల సందర్భంగా ఉపయోగించడానికి ఆలయంలో అందమైన బంగారు రథం కూడా ఉంది.

'మండయప్పం' ప్రసాదం..

కేరళ నుంచే కాకుండా దేశవిదేశాల నుండి వచ్చే మహిళా భక్తులు చేసే శరణుఘోష ఆలయ ప్రాంగణమంతటా ఎల్లప్పుడూ వినిపిస్తూనే ఉంటుంది. ఈ ఆలయాన్ని దర్శించే భక్తుల వ్యాధులన్నీ నయమవుతాయి. మానసిక రోగులకు సైతం స్వస్థత చేకూరుతుది. ఈ ఆలయంలో భక్తులకు ప్రసాదంగా ఇచ్చే 'మండయప్పం' సర్వరోగనివారిణిగా పనిచేస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. బియ్యంపిండి, బెల్లం, పెసరపప్పు, ఏలకులు, సొంటి మిశ్రమాన్ని నీటి ఆవిరితో ఉడికించి ఈ మండయప్పం తయారు చేస్తారు. వీటిని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన తర్వాతే భక్తులకు పంచిపెడతారు.

11న మాసి ఉత్సవం...

ఈ ఆలయంలో వార్షిక మాసి మాస ఉత్సవాలు ఈ నెల రెండున ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ వేడులలో ప్రధాన ఘట్టమైన 'వలియ పడుక్కై' పేరుతో నిర్వహించే ఉత్సవం ఖ్యాతిగడించింది. మహిళలంతా తలపై వెదురు బుట్టలతో వివిధ రకాల పూలు, ఫలాలు, ఫలహారాలు, జంతికలు, వడలు, అప్పాలను నింపుకుని నోటికి వస్త్రం కట్టుకుని ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి ఎదుట సమర్పిస్తారు. ఆ రోజున అమ్మవారికి నైవేద్యంగా, భక్తులకు ప్రసాదంగా అప్పటికప్పుడు దంచిన ఉప్పుడు బియ్యంతో వేడివేడి అన్నం సిద్ధం చేస్తారు. ఆ రోజు రాత్రి 10 నుండి వేకువజాము ఒంటి గంట దాకా ఈ 'వలియపడుక్కై' పూజలు జరిగేటప్పుడు ఆలయంలో నిశ్శబ్దంగా ఉంటుంది. ఇదే విధంగా ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాల్లో ఈ ఆలయాన్ని దర్శించేందుకు వేలాదిమంది భక్తులు విచ్చేస్తారు.

ఎలా వెళ్లాలి?

ఈ ఆలయం కన్నియాకుమారి జిల్లాలోని నాగర్‌కోవిల్ నగరానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. నాగర్‌కోవిల్‌కు చెన్నై నగరం నుంచే కాకుండా పలు ప్రధాన నగరాల నుండి రాష్ట్ర రవాణ సంస్థ బస్సులు, ఆమ్నీ బస్సులు నడుపుతున్నారు. నాగర్‌కోవిల్ నుండి ఈ ఆలయానికి వెళ్లేందుకు మినీ బస్సులు, ప్రైవేటు వ్యాన్లు, షేర్‌ఆటోలు, టాక్సీలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ ఆలయాన్ని రోజూ వేకువజాము 5 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల దాకా తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



చెన్నై సచివాలయంలో కళలు సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో 2024-25 సంవత్సరానికిగాను 'కళై సెమ్మల్' అవార్డులను స్వీకరించిన మేటి చిత్రకారులు, శిల్ప, హస్త కళాకారులు ఆరుగురితో ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రి సామినాథన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం తదితరులు



సచివాలయం వెలుపల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆ శాఖలో పనిచేస్తున్న ఉన్నతాధికారులు, ఉద్యోగులకు రూ.4.57 కోట్ల తో కొనుగోలు చేసిన 51 వాహనాలను పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

సింహ వాహనంపై సుబ్రమణ్యస్వామి చిద్విలాసం

తిరుత్తణి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మాసి బ్రహ్మోత్సవాలతో పాటు మాసి నెల కృతిక సందర్భంగా గురువారం తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారిని బంగారు ఆభరణాలతో అలకరించి, మహదీపారాధనచేశారు. స్వామివారి దర్శనం కోసం రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణా రాష్ట్రాల నుండి భక్తులు కొండపైకి చేరుకున్నారు. దీంతో ఆలయ మాడవీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఈ క్రమంలో ఉదయం 10గంటలకు శ్రీవల్లి, దేవసేన సమేతుడై సుబ్రమణ్యస్వామిని సింహవాహనంపై కొలువుదీర్చి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు.



సింహవాహనంపై విహరిస్తున్న మురుగన్

ఘనంగా కలైంజర్ కలం అవార్డుల ప్రదానోత్సవం



'కలైంజర్ ఎళుదుకోల్' అవార్డులను ప్రదానం చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయ రంగంలో విశిష్ట సేవలందించిన జర్నలిస్టులకు 'కలైంజర్ ఎళుదుకోల్' (కలం) పేరుతో ఇచ్చే అవార్డులకు ఈ సారి 'నక్కీరన్' తమిళ పత్రిక సంపాదకుడు 'నక్కీరన్ గోపాల్, మహిళాభ్యుదయానికి పాటుపడుతున్న సుకితా సారంగరాజ్ ఎంపికయ్యారు. సచివాలయంలో గురువారం తమిళభాషాభివృద్ధి, సమాచార శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ వీరిద్దరికి ఈ అవార్డు కింద తలా రూ.5లక్షలు, ప్రశంసాపత్రం అందజేశారు. 2023 సంవత్సరానికిగాను వీరిద్దరికీ ఈ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తమిళభాషాభివృద్ధి, సమాచార శాఖల మంత్రి ఎంపీ సామినాథన్, ఆ శాఖ కార్యదర్శి వి.రాజారామన్, సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు డాక్టర్ ఇరా వైద్యనాథన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

అశ్విన్‌కు రోటరీ క్లబ్ 'జీవిత సాఫల్య పురస్కారం

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): క్రికెట్‌లో పలు విజయాలు సాధించిన వెటరన్ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్‌కు రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 3234 'జీవిత సాఫల్య పురస్కారం' ప్రదానం చేసింది. ఇటీవల చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. పారిశ్రామికవేత్త, ప్రముఖ చిత్ర నిర్మాత ఏవీఎం బాలసుబ్రమణ్యం, ఎన్ఎస్ శరవణన్, క్లబ్ జిల్లా గవర్నర్ రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-3234, డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ రవి సుందరేశన్ తదితరులు ఈ పురస్కారాన్ని అశ్విన్‌కు అందజేశారు.



అశ్విన్‌కు పురస్కారం అందజేస్తున్న బాలసుబ్రమణ్యం

నేటి నుంచి సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాలు



టినగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శర్వాణీ సంగీత సభ ట్రస్టు ఆధ్వర్యంలో టి.నగర్‌లోని శృంగేరి భారతీ విద్యాశ్రమం సహకారంతో శుక్రవారం నుంచి బ్రహ్మశ్రీ డాక్టర్ సామవేదం షణ్ముఖశర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభమవుతాయని ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. టి.నగర్ వెంకటనారాయణరోడ్డులోని శృంగేరీ భారతీ విద్యాశ్రమంలో 'విష్ణు సహస్రనామ సార వైభవం' అనే అంశంపై నిర్వహించే ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు ఆదివారం వరకూ కొనసాగనున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఆదివారం సాయంత్రం 4.30 నుండి 6 గంటల వరకు 'శివపదం' విశిష్టగానం జరుగుతుందని, నిహాల్, సుంకేశుల వెంకటనాగ రాజన్ గానానికి డా. వివిఎల్ సుదర్శన్ (వైలిన్), ఎస్. విజయేందన్ (మృదంగం) వాద్య సహకారం అందిస్తారని, ఈ కార్యక్రమాలకు అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు తెలిపారు.



నవపాషాణ మురుగన్ విగ్రహం

పళని నవపాషాణ విగ్రహానికి ధోకాలేదు!

● స్పష్టం చేసిన విగ్రహ సంరక్షణ కమిటీ

ప్యారీస్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలోని పళని దండాయుధపాణి ఆలయంలో స్వామివారి నవపాషాణ విగ్రహం పటిష్ఠంగా వుందని విగ్రహ సంరక్షణ కమిటీ ప్రకటించింది. సుమారు 5వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఆ నవపాషాణ విగ్రహానికి ఆలయ నిర్వాహకులు ప్రతిరోజు ఆరు కాల అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ విగ్రహాన్ని సంరక్షించేందుకు, చెక్కు చెదరకుండా ఉండేందుకు మద్రాస్ హైకోర్టు ఉత్తర్వుల మేరకు రిటైర్డ్ జడ్జీ పొంగియప్పన్ నేతృత్వంలో హిందూ దేవాదాయశాఖ ఓ కమిటీని నియమించింది. ఇందులో ప్రముఖ మఠాధిపతులు, స్థపతులు సహా 15మంది సభ్యులుగా వున్నారు. మరోవైపు చెన్నై ఐఐటీ నిపుణుల బృందం కూడా ఇటీవల పళని నవపాషాణ విగ్రహాన్ని పరిశీలించింది. విగ్రహ సంరక్షణ కమిటీ ఈ విగ్రహాన్ని తరుచూ పరిశీలిస్తూ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తోంది. ఇదిలా వుండగా ఆలయ ప్రాంగణంలో బుధవారం రిటైర్డ్ న్యాయమూర్తి పొంగియప్పన్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో కుండ్రకుడి పొన్నంబల అడిగళార్ సహా సభ్యులంతా పాల్గొన్నారు. సమావేశం అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, మురుగన్ నవపాషాణ విగ్రహం మరి కొన్ని శతాబ్దాల దాకా చెక్కుచెదరకుండా ఉంటుందని చెన్నై ఐఐటీ నిపుణుల కమిటీ నిర్ధారించిందని తెలిపారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.11 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,285

తలనీలాలు సమర్పించినవారు: 20,829





జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాను. గ్రామీణ కళ నాకు కూడుపెట్టింది. నా ఇద్దరు పిల్లల భవిష్యత్తుకి బాట వేసింది. ఈ సమయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సహకారం మరువలేనిది. ఆడవాళ్లతో పాటూ మగవాళ్లకూ ఉపాధి చూపే స్థాయికి నేను చేరుకున్నాను.

\- చంద్రకళ

చంద్రకళ

● దేశ,విదేశాల్లో మెప్పు పొందుతున్న తొర్రూరు కొయ్యబొమ్మలు

రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఢిల్లీకి వెళ్లినపుడు ప్రధాని మోదీ కీ, కేంద్ర మంత్రులకూ ఏపీ హస్తకళాకృతులను కానుకలుగా అందజేస్తుంటారు. అందులో కొయ్యతో చేసిన దేవతామూర్తులు, గోపురాల బొమ్మలు ముఖ్యమైనవి. ఈ అద్భుత కొయ్య కళాఖండాలు తయారవుతున్నది మన పుత్తూరు మండలంలోని తొర్రూరులో అని చాలా మందికి తెలియదు. ఒక మహిళ ఈ దారుశిల్పాల రూపశిల్పి. ఆమె పేరు చంద్రకళ. భర్త మరణం తర్వాత తను బతకడానికి నేర్చుకున్న కళ ఇప్పుడు 35 మందికి బతుకు చూపిస్తోంది. అంతర్జాతీయ ఖ్యాతికి కారణమైంది.

\- పుత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

కుప్పంలో పుట్టిన చంద్రకళ బీకాం కంప్యూటర్స్ చేశారు. అంతకన్నా పై చదువులకు వెళ్లాలనే ఆశ ఉన్నా పేద కుటుంబానికి సాధ్యం కాలేదు. పెళ్లి చేసేశారు. 1998లో పుత్తూరుకి అత్తగారింటికి చేరిన ఆమె తన భర్త సంప్రదాయ పద్ధతుల్లో చెక్కే చేసే కొయ్యబొమ్మలను దీక్షగా చూసేవారు. ఎంత కష్టపడ్డా ఆదాయం వచ్చేది కాదు. ఇద్దరు కొడుకులు పుట్టారు. కొయ్య బొమ్మలు చెక్కడం తనూ నేర్చుకున్నారు. ఆర్థిక సమస్యల్లోంచి బయటపడడానికి ఒక పొదుపు సంఘంలో ఆమె చేరారు. భర్తను ఒప్పించి 5 వేలు అప్పు తీసుకుని వేప, వెంగ, చీమచింత కొయ్యలు కొని తన ఆలోచనలకు అనుగుణంగా బొమ్మలు చెక్కడం మొదలు పెట్టారు. ఈ కొత్తదనం కొనుగోలుదారులను ఆకర్షించింది. 2017లో భర్త హఠాన్మరణం ఆ కుటుంబాన్ని కుంగదీసింది. అయితే చేతిలో ఉన్న కళ ఆమెకు దారి చూపింది. బొమ్మల్లో, రంగుల్లో నిరంతరం కొత్తదనం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. చంద్రకళ చెక్కిన బొమ్మలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. తనలాంటి మరికొందరు మహిళలను ఆమె పోగేసుకుని కొయ్యబొమ్మల పనిలో భాగం చేసింది. ఎంపీఎస్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ పేరుతో ఆమె సంస్థ ఇప్పుడు 35 మందికి ఉపాధి చూపుతోంది. ఆన్‌లైన్‌లోనూ అమ్మకాలు చేస్తోంది. నెలకు లక్షకు పైగా ఆదాయం లభిస్తోంది. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మార్కాపురంలోని డ్వాక్రా బజారులోనూ తొర్రూరు కొయ్యబొమ్మల ప్రదర్శన ఉంటుంది.

ఇదే ప్రత్యేకత:

సింథటిక్, ఎనామిల్‌తో పాటు మల్టీషేడ్ రంగులను వినియోగించడం వల్ల చంద్రకళ బొమ్మల్లో సహజత్వం ఉట్టిపడుతోంది. బొమ్మల తయారీకి మీమ్ వుడ్ , టేక్ వుడ్, కంట్రీవుడ్ లను ఈమె వినియోగిస్తున్నారు. వీటికి వాటర్‌ప్రూఫ్ కోటింగ్ ఉంటుంది..

ఇల్లాలి చదువు ఇంటికే కాదు జగానికే వెలుగు అని తిరుపతి నగరంలోని మూడు విద్యా సంస్థలు నిరూపిస్తున్నాయి. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఆనాడే మహిళావిద్య అవసరాన్ని గుర్తించి, వారికోసమే ప్రత్యేకించి ఓ విశ్వవిద్యాలయం తిరుపతిలో ఏర్పాటు చేశారు. అంతకు ఎన్నేళ్ల ముందో టీటీడీ సహకారంతో ఈ నగరంలోనే తొలి మహిళా డిగ్రీ కళాశాల ఏర్పడింది. ఇటీవల ఏర్పడిన మహిళా వైద్యవిద్యాలయం మూడో కిరీటంగా మారింది. మహిళా సాధికారతకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా ఈ విద్యాసంస్థలు నిలుస్తున్నాయి.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి..తిరుపతి(విద్య)

తిరుపతి సిగలో

మూడు పద్మాలు




పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం

తొలి వర్సిటీకి బీజం

1983 ఏప్రిల్ 14న తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఏర్పడింది. 138 ఎకరాల విస్తీర్ణంలో 9 విభాగాలతో శ్రీకారం చుట్టుకుంది. నాలుగు దశాబ్దాల్లో 50 కోర్సులకు విస్తరించింది. ఆరు వేల మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. . బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ప్రత్యేకతను చాటుకుంటూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపును పొందగలిగింది. యూజీసీ నాక్ ఏ-ప్లస్ గ్రేడ్‌ను కూడా సాధించింది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఉత్తమ ర్యాంకు సొంతం చేసుకుంది. విదేశీ విద్యార్థులకు సైతం సంగీత విద్యను నేర్పుతోంది. మహిళల్లో సామాజిక చైతన్యానికి జరుగుతున్న కృషిలో పాలుపంచుకుంటోంది వర్సిటీ. పీఎం ఉష పథకం కింద అందిన రూ.100 కోట్ల నిధి వర్సిటీ పురోగతికి దోహదపడింది

తొలి 'పట్టా'భిషేకం



పద్మావతి డిగ్రీ కళాశాల

రాష్ట్రంలో తొలి మహిళా కళాశాలకు తిరుపతి కేంద్రమైంది. 1951లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో అబ్బాయిల కాలేజీలో అమ్మాయిలను చేర్చుకోరాదంటూ మద్రాసు వర్సిటీ సిండికేట్ తీర్మానించింది. దీంతో మహిళా విద్యకు గండి పడింది. వెంటనే టీటీడీ స్పందించింది. మహిళలకు బాసటగా నిలిచింది. 1952లో వంద ఎకరాల్లో వేంకటేశ్వర స్త్రీల కళాశాలను ఏర్పాటు చేసింది. రెండేళ్లకు ఎస్వీ యూనివర్సిటీ ప్రారంభమైంది. 1956లో పద్మావతీ మహిళా డిగ్రీ కాలేజీగా పేరు మారింది ప్రిన్సిపాల్ రాజేశ్వరిమూర్తి నేతృత్వంలో ఈ కాలేజి అభివృద్ధికి విశేష కృషి జరిగింది. మాజీ రాష్ట్రపతులు నీలం సంజీవరెడ్డి, బాబూ రాజేంద్రప్రసాద్, మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి వంటి ప్రముఖులు ఈ కాలేజీని సందర్శించి ముగ్ధులయ్యారు.

●మహిళల ..మెడి'కల' నెరవేరింది

దేశ రాజధాని ఢిల్లీ తర్వాత దక్షిణాదిన తొలి ప్రభుత్వ మహిళా వైద్యకళాశాల తిరుపతిలోనే ఆవిర్భవించింది. 2014లో 50 ఎకరాల్లో స్విమ్స్‌కు అనుబంధంగా పద్మావతి మహిళా వైద్య కళాశాల 150 సీట్లతో ప్రారంభమైంది. తర్వాత బలహీన వర్గాలకోసం 25 సీట్లను కేటాయించింది. యూజీ-నీట్ ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయి. 175 సీట్లతో ఆరు బ్యాచ్‌ల వైద్య విద్యార్థులను ఇప్పటివరకూ అందించింది. దాదాపు వెయ్యి మంది మహిళా వైద్యులు తయారై సేవలందిస్తున్నారు. ఈకాలేజ్ టీచింగ్ రీసెర్చ్‌గా ఉపయోగపడుతోంది. ఇక్కడి వైద్యులకు ప్రైవేట్ ప్రాక్టీస్ అవకాశం లేకపోవడంలో నాణ్యమైన బోధన జరుగుతోంది. స్విమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ కోర్సుల వల్ల అరుదైన ఆపరేషన్లపై శిక్షణకూ అవకాశం కలుగుతోంది.



పద్మావతి మహిళా వైద్య కళాశాల

ఓటేరు చెరువు వేరు... రైతుల భూములు వేరు

● అసత్య ప్రచారాలు మానండి ● మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఓటేరు చెరువుకు, శ్రీకాళహస్తి రైతులకు ఉన్న భూమికీ ఏ సంబంధం లేదని, రెండూ వేరువేరు అని, రైతులు చెరువును ఆక్రమించుకోలేదని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు అన్నారు. గురువారం శ్రీకాళహస్తిలో తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఓటేరు వద్ద రైతులు కొనుగోలు చేసిన భూమిపై ఎలాంటి అసత్య ప్రచారాలు వేయవద్దని కోరారు. తనపై సీపీఎం, సీపీఐ నాయకులు అబాండాలు వేయడం సరికాదంటూ, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధికారులను బ్లాక్‌మెయిల్ చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సర్వే నెంబరు 376లో 12.45 ఎకరాలు ఓటేరు చెరువు అని, సర్వే నెంబరు 370లో 6.70ఎకరాలు కాలువ ఉందని, సర్వే నెంబరు 377లో 17.18ఎకరాలు రైతుల భూమి ఉందని ఆయన వివరించారు. 1906లో బ్రిటీష్‌వారు తయారు చేసిన ఎ రిజిస్టర్, రిజిస్ట్రీ ఆఫ్ హోల్డింగ్‌లో ఇది పుంజు భూమిగా నమోదు అయిందని తెలిపారు. 1906నాటి రికార్డును ఎవరు తారుమారు చేయలేరని స్పష్టం చేశారు. కేసులన్నీ రైతులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చాయని చెప్పారు. రైతుల భూముల్లోనే జాతీయ రహదారి నిర్మాణం జరిగిందని చెబుతూ, 'చెరువు భూమి అయితే నేషనల్ హైవే వారు చెరువులో రోడ్డు వేస్తారా?' అని ప్రశ్నించారు. సీపీఎం, సీపీఐ నాయకుల వెనుక ఉండి దుష్ప్రచారం చేయిస్తున్న వారు వాస్తవాలు గ్రహించాలన్నారు.

అది ప్రభుత్వ భూమి కాదు

● శ్రీకాళహస్తి రైతుల వివరణ

తిరుపతి, మార్చి6(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామంలోని సర్వే నెం:377లో 17.18 ఎకరాల భూమి ప్రభుత్వానిది కాదని, సర్వే నెంబరు 376లోని 12.40 ఎకరాలు మాత్రమే ఓటేరు చెరువుకు సంబంధించిన స్థలమని శ్రీకాళహస్తికి చెందిన రైతులు తెలిపారు. ఓటేరు చెరువు అన్యాక్రాంతమవుతోందన్న వివాదం నేపథ్యంలో 'ఓటేరు చెరువు చదరం' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై రైతులు ప్రభుత్వ రికార్డులతో పాటు వివరణ ఇచ్చారు. జాయింట్ పట్టా భూమిని విక్రయ పత్రాల రిజిస్టరు డాక్యుమెంటు ప్రకారం సబ్ డివిజన్ చేసి అడంగల్‌లో నమోదుచేయాలని తాము కోరడంతో, సీఎం రైతుల సమస్యలను పరిష్కరించాలని గత ఏడాది సెప్టెంబరు 24న కలెక్టర్‌కు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అయితే తమ భూమిని కొందరు చెరువుగా భావిస్తున్నారని, సర్వే నెంబరు 376లో 6.7ఎకరాల చెరువు, కసింకాలువను కొందరు ఆక్రమించారంటూ ఒక్క సెంటు భూమి కూడా తాము ఆక్రమించలేదని పేర్కొన్నారు.

12న చిదంబరం నటరాజస్వామికి మహా అభిషేకం

పెరంబూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చిదంబరం నటరాజస్వామికి మహా అభిషేకం ఈ నెల 12వ తేది జరుగనుంది. చిదంబరం నటరాజ ఆలయంలోని చిత్‌సభలో ఉన్న శివగామి సుందరి సమేత నటరాజస్వామికి చిత్తిరై, ఆణి, ఆవణి, మార్గళి, మాసి, పురటాసి మాసాలు అని ఏడాదికి ఆరు సార్లు మహా అభిషేకం నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, మాసి నెల మహాభిషేకం చిత్‌సభ ముందున్న కనకసభలో ఈ నెల 12న సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు పంచామృతం, విభూది తదితరాలతో అభిషేకాలు, మహా దీపారాధన వేడుకలు జరుగనున్నాయి. ఉదయం 9 గంటలకు శివగామిసుందరి సమేత ఆనంద నటరాజ మూర్తికి లక్షార్చన, 10 గంటలకు మహారుద్ర జప పారాయణం, మధ్యాహ్నం 2 గంటలకు మహారుద్ర యాగం, దంపతి పూజ, గో పూజ, అశ్వ పూజ, గజ పూజ, మహా పూర్ణాహుతి దీపారాధన, సాయంత్రం 6 గంటల తరువాత కనకసభలో మహారుద్ర జప మహాభిషేకం స్వీకరించనున్నారు. వేడుకల్లో భక్తులకు అన్ని వసతులు కల్పించినట్లు ఆలయ కార్యదర్శి వెంకటేశ్ దీక్షితులు తెలిపారు.

● 'కల్తీ నెయ్యి' కేసు నిందితులకు

ముగిసిన సిట్ కస్టడీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో ఇద్దరు నిందితులకు మూడు రోజుల సిట్ కస్టడీ ముగిసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ కేసులో ఏ3 నిందితుడు పొమిల్ జైన్, ఏ5 అపూర్వ వినయ్‌కాంత్ చావడాలను మంగళవారం సిట్ అధికారులు తమ కస్టడీకి తీసుకున్నారు. సిట్ కార్యాలయంలో విశాఖ సీబీఐ డీఐజీ మురళీ రాంబా నేతృత్వంలో అధికారులు వివిధ కోణాల్లో విచారించారు. వారిద్దరి వాంగ్మూలాలను రికార్డు చేశారు. మూడు రోజుల కస్టడీ గడువు ముగియడంతో గురువారం సాయంత్రం బందోబస్తు మధ్య ఆ ఇద్దరిని జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించారు. మరోవైపు ఏ2 నుంచి ఏ5 వరకు బెయిల్ కోసం దాఖలైన పిటిషన్లపై ఈ నెల 10న విచారణ జరగనుంది.

పుదువై పోలీసులకు శిక్షణ



పుదుచ్చేరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ఐఆర్బీ విభాగం పోలీసులు, ఇన్స్‌పెక్టర్ సెంథిల్‌కుమార్ నేతృత్వంలో నడక శిక్షణలో పాల్గొన్నారు. కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో 2005లో 'ఇంటీరిమ్ రెసల్యూషన్ ప్రొఫెషనల్ (ఐఆర్బీ) విభాగం ప్రారంభించగా, 800 మంది పోలీసులు ఈ విభాగంలో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఐఆర్బీ విభాగం పోలీసులు తగిన వ్యాయామం చేయకపోవడంతో, పలువురు శారీరక ఇబ్బందులకు గురవుతున్నారు. అందువల్ల మాజీ ముఖ్యమంత్రి, ఎస్పీ, డిప్యూటీ కమాండర్ సహా పలు అధికారుల ఇళ్లలో విధులు నిర్వహిస్తున్న ఐఆర్బీ పోలీసులు తప్పకుండా వ్యాయామం చేయాలని డీజీపీ షాలిని సింగ్ ఉత్తర్వులు జారీచేశారు. తొలివిడతగా పోలీసు అధికారుల ఇళ్లలో పనిచేస్తున్న 70 మంది ఐఆర్బీ పోలీసులు ఓడియన్‌శాలై సీఐ సెంథిల్‌కుమార్ నేతృత్వంలో వంబకీరపాళయం, వానరపేట, ఉరులయన్‌పేట పోలీసు స్టేషన్ల పరిధిలో గురువారం నడక శిక్షణలో పాల్గొన్నారు.

నంగనల్లూరు వద్ద రూ.65 కోట్ల వ్యయంతో హజ్‌హౌస్ నిర్మాణానికి ఉత్తర్వులిచ్చినందుకు సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని ధన్యవాదాలు తెలుపుతున్న ముస్లిం మతపెద్దలు జనాబ్ సలావుద్దీన్ మహమ్మద్ అయుబ్, జనాబ్ ఎం.సయ్యద్ మసూద్, జనాబ్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జనాబ్ బసూలుల్ హక్, జనాబ్ అబ్దుల్ ఖాదీర్, జనాబ్ కే అబ్దుల్ ఖరీమ్, జనాబ్ కేఎం మహమ్మద్ హష్రఫ్ అలీ, జనాబ్ అక్టర్ అలీ తదితరులు



రథోత్సవంలో రెచ్చిపోయిన 'కేడీ సిస్టర్స్'

● రద్దీలో చేతివాటం ప్రదర్శన
● ఏడుగురు మహిళల నుంచి ఏడు బంగారు గొలుసుల చోరీ
● ఇద్దరు తమిళనాడు మహిళల అరెస్టు



స్వాధీనం చేసుకున్న బంగారాన్ని చూపుతున్న పోలీసు అధికారులు

శ్రీకాళహస్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగిన రథోత్సవంలో తమిళనాడుకు చెందిన ఇద్దరు అక్కా చెల్లెళ్లు చేతివాటం చూపారు. ఏడుగురు మహిళల నుంచి బంగారు గొలుసులు అపహరించారు. వీరిని గురువారం అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం మధురై ప్రాంతానికిచెందిన మీనా అలియాస్ లక్ష్మి(29), తిరుచ్చి ప్రాంతానికిచెందిన పొన్నుమని(34) అక్కా చెల్లెళ్లు. వీరిద్దరూ తమిళనాడులోని పలు రద్దీ ప్రాంతాల్లో తిరుగుతూ చోరీలకు పాల్పడేవారు. మీనాపై తమిళనాడులో ఆరు చోరీకేసులు నమోదయ్యాయి. ఇటీవల ఓ కేసులో రిమాండు నుంచి బయటకు వచ్చింది. తమిళనాడులోని సంతలో చోరీ చేస్తూ పొన్నుమని పోలీసులకు పట్టుబడి అరెస్టయింది. ఈమె కూడా 20రోజుల కిందట బెయిల్‌పై విడుదలైంది. వీరిద్దరూ కలిసి గత నెల 27వ తేదీన శ్రీకాళహస్తిలో జరిగిన రథోత్సవానికి వచ్చారు. జనాలు అత్యధికంగా ఉండే చోట్ల ఏడుగురు మహిళల నుంచి సుమారు105గ్రాముల బంగారు చైన్లను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ గోపి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా విచారణ సాగించారు. వారం రోజుల వ్యవధిలోనే తమిళనాడుకు చెందిన ఇద్దరు అక్కా చెల్లెళ్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బంగారు గొలుసులను రికవరీ చేశారు. ఆ ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు. వన్‌టౌన్ సీఐ గోపి, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించి రివార్డును ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సీఐలు తిమ్మయ్య, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.